

వివరాలు మెయిన్‌లో

## రైతు భరోసా బకాయిలు చెల్లించాలి..రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేయాలి


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

### నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 19 మార్చి , 2026 | పేజీలు : 05


### రైతు భరోసా పథకం అప్లికేషన్లు ప్రారంభం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** రైతు భరోసా పథకం కింద ఫిబ్రవరి 28వ తేదీ లోపు భూభారతి ద్వారా డిజిటల్ సంతకం చేయబడిన పట్టా పాస్ బుక్ కలిగిన రైతులందరూ రైతు భరోసా పథకానికి అర్హులని వారందరూ రైతు భరోసా దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి బుధవారం మండల కేంద్రంలో ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంతకుముందు రైతు భరోసా వస్తున్న రైతులు మరల దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని బ్యాంక్ అకౌంట్ మార్చుకోవాల్సిన అవసరం ఉన్న రైతులు మాత్రమే మరల దరఖాస్తు చేసుకోవాలని ఆమె అన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన వారికి అవసరమైన పత్రాలు రైతు యొక్క ఆధార్ కార్డు జిరాక్స్, పట్టా పాస్ బుక్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, అప్లికేషన్ ఫారంతో వ్యవసాయ విస్తీర్ణ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని దీనికి చివరి తేదీ ఈనెలమార్చి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

# ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

### జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో నమోదు కావాలన్నదే ఎన్నికల సంఘం ఉద్దేశమని జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి బి.చంద్రశేఖర్ అన్నారు.ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పార్టీ పోలింగ్ బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించి కార్యక్రమానికి సహకరించాలని కోరారు. 18 ఏళ్లు పూర్తి చేసిన ప్రతి భారత పౌరుడు ఓటరుగా నమోదు కావాలని తెలిపారు. మ్యాపింగ్ కాని ఓటర్లను గుర్తించి నమోదు చేయించాలని సూచించారు.అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ నిర్వహిస్తారని, ప్రజలు అవసరమైన పత్రాలతో సహకరించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్,ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్‌సి యాక్షన్ ప్లాన్ పథకాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండలంలోని షెడ్యులు కులాలకుకి చెందిన నిరుద్యోగ, యువతీ యువకులు, వ్యవసాయ దారులందరికి 202526 సంవత్సరం ఎస్సి యాక్షన్ ప్లాన్ పథకం క్రింద మీద సబ్సిడీ పథకాలకు దాకాసులు కోరుతున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్యామల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా అర్హులైన వారందరికీ ఈ కింద యూనిట్లు మంజూరు చేయబడతాయని ఆమె తెలిపారు. విద్యుత్ ద్విచక్ర వాహనాలు (ఇవి టు విల్లర్స్ ) విద్యుత్ మూడు చక్రాల వాహనాలు (ఇవి త్రీ విల్లర్స్), సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ వ్యవసాయ సంబంధిత పరికరములకు సంబంధించి అర్హులైన వారందరూ www.tgobmms.cgg.gov.in ఆన్ లైన్ తేది:17/03/2026 నుండి 24/03/2026లోగా నమోదు చేసుకోవాలని ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసిన తదుపరి అట్టి దరఖాస్తు ఫారమును సంబంధిత పత్రాలను జత చేసి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె తెలిపారు. వీటికి సంబంధించిన అర్హతలు కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,50,000 లోపు, రవాణా పథకాలకు తేది: 01/07/2025 నాటికి 21 సం.ల నుండి 50 సం.ల మధ్య వయస్సు కల్గి ఉండాలని వ్యవసాయ ఆధారిత పథకాలకు తేది: 01/07/2025 నాటికి 21 సం.ల నుండి 60సం.ల మధ్య వయస్సు కల్గి ఉండాలని. సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ పథకమునకు కనీసం 200 ఎకరముల భూమి బోరు బావిలో నీరు కలిగి ఉన్నవారు అర్హులుగా ప్రకటించబడ్డారని ఆమె తెలిపారు. **జతచేయాల్సినవి పత్రాలు..** ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం(మీసేవ కేంద్రం ద్వారా జారీ చేసినది), కుల ధ్రువీకరణ పత్రం (తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తీసి ఉండాలి), శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, సోలార్ యూనిట్ కొరకు బోరు బావిలో నీరు కల్గి ఉన్న ధ్రువీకరణ పత్రం సంబంధిత పంచాయతీ కార్యదర్శి ద్వారా జారీ చేయబడి యుండాలి, పట్టాదారు పాస్ పుస్తకం (వ్యవసాయ ఆధారిత పథకములకు), సదరం సర్టిఫికేట్ (దివ్యాంగులకు), పాస్ ఫోటో సైజ్ ఫోటో కలిగి ఉండాలని ఆమె అన్నారు.

## ప్రజలందరికీ తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఈ పరాభవ నామ సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అన్ని రంగాల ప్రజల ఆశలు చిగురించి ప్రతి ఇంటా సిరులు పండాలని కోరారు. తెలుగు వారి కొత్త సం వత్సరంలో ప్రజలందరికి మేలు జరుగాలని ఆకాంక్షించారు. ప్రకృతితో మమేకమై వ్యవసాయ ఉత్పత్తి సంబంధాలలో పరస్పర సహకారం ప్రేమాభిమానాలతో పాల్గొనే సబ్బండ వర్గాలకు ఉగాది గొప్ప పర్వదినమన్నారు. షడ్రురుచుల వలె అన్ని రంగాల ప్రజలు కలిసిమెలసి ఐక్యతతో ముందుకు సాగాలని అన్నారు. ప్రకృతి అనుకూలించి రైతులతోపాటు ఉద్యోగ వ్యాపార అన్ని రంగాల ప్రజలు సంఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

### ప్రజలందరికీ మంచి జరగాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పరాభవ నామ సంవత్సరంలో ప్రజలందరికి మంచి జరగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ బుధవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలన్నారు. ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు శ్రీకారం చుట్టే శుభదినమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని, జిల్లా అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పండుగ వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు.

### ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలి :రవీంద్రకుమార్

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్ఏ రమావత్ రవీంద్రకుమార్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతలు తమ వ్యవసాయ పనులను ఉగాది నుండి కొత్తగా ప్రారంభిస్తారని, వ్యవసాయ నామ సంవత్సరంగా ఉగాది నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సరం సాగు, తాగు నీరు పుష్కలంగా లభించి, సమృద్ధిగా పంటలు పండి, ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్ళివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

# ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపాలి

### చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించాలి

### సిపిఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్‌పై యుద్ధం ఆపాలని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు సూచించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విజయ్ కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నాలుగవ వర్ధంతి సందర్భంగా సిపిఎం సూర్యాపేట జిల్లా కమిటి ఆధ్వర్యంలో ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దాడులు దాని పర్యవసానాలు అనే అంశంపై జరిగిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇరాన్‌పై యుద్ధం మూలంగా దేశంలో గ్యాస్ కొరత తీవ్రంగా ఏర్పడిందన్నారు. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయి రాబోయే రోజుల్లో చమురు, డీజిల్, పెట్రోల్ దొరకకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ పై రూ.60 పెంచిందన్నారు. మోదీ ప్రభుత్వం దేశ ప్రయోజనాల కన్నా ఇరాన్‌పై యుద్ధానికి ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదం, ఇజ్రాయిల్ దాడిచేసి వందలాది మంది సాధారణ పౌరులను హతమార్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇరాన్‌పై వెంటనే దాడులను ఆపేయాలని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని డిమాండ్ చేశారు. స్వరాజ్యం అంటే వ్యక్తికాదు మహాశక్తి ఆమె ఒక ఉద్యమ కిరణం అన్నారు. అంతకుముందు మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గేయాలు పలువురిని ఆకట్టుకు న్నాయి. సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి , రాష్ట్ర కమిటి సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, నాగారపు పాండు, పారేపల్లి శేఖర్ రావు పాల్గొన్నారు.

# ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా యూనుస్ కమాల్ ఎన్నిక

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఉమ్మడి నల్లగొండ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎండి యూనుస్ కమాల్ ఎన్నికైనట్లు అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ హఫీజ్ ఖాన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఎండి యూనుస్ కమాల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన అధ్యక్షుడు వేముల వీరేశం, ప్రధాన కార్యదర్శి గొట్టిపాటి కర్తయ్య, కోశాధికారి ఇమామ్ కరీం లకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.





## రోశయ్య సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** గీత పనివారల సంఘం నాయకులు సోమగాని రోశయ్య ఆ సంఘానికి చేసిన సేవలు మరువలేనివని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని గీత పనివారల సంఘం నాయకుడు సోమగాని రోశయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో గీత పనివారాల సంఘం రాష్ట్ర నాయకులు పాలకూరి బాబు, కౌన్సిలర్ చెన్నగాని సైదులుగౌడ్, సిపిఐ నాయకులు దేవరం మల్లేశ్వరి, గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్ పాల్గొన్నారు.

## కెసిఆర్ పాలనలోనే వ్యవసాయం స్వర్ణయుగం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం స్వర్ణయుగంలా ఉన్నదని హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి డైరెక్టర్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లానాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయ రంగం మునుపెన్నడు లేని విధంగా అభివృద్ధి సాధించిందని తెలిపారు. ప్రపంచంలో మరి ఎక్కడ లేని విధంగా కెసిఆర్ రైతుబంధు పథకాన్ని రూపకల్పన చేసి రైతన్నలకు పెట్టుబడి సాయం అందించి ఆదర్శంగా నిలిచారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చిన రుణ మాఫీ, రైతు భరోసా, ఇన్‌పూట్ సబ్సీడిలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

## కిట్స్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలోని కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో బిటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు టాస్క్ నిపుణులు మార్క్‌లోయిస్ ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులలో విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాం మీద అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ గాంధీ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థినులు వివిధ నైపుణ్యాలను పెంపోందించుకున్నప్పుడు మాత్రమే ఉన్నత ఉపాధి అవకాశాలు అందుకోవచ్చని అన్నారు. కళాశాల డైరెక్టర్ నాగార్జునరావు, విభాగాధిపతి స్రవంతి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## గంగమ్మకు ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండల కేంద్రంలోని చెరువుని గోదావరి జలాలతో నింపిన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహకారంతో చెరువు నిండి అలుగు పోస్తున్న సందర్భంగా కట్టమైసమ్మకు, గంగమ్మకు మొటకొండూర్ సర్పంచ్ భూమండ్ల జేయమ్మ శ్రీనివాస్, ఉప సర్పంచ్ వంగాల నిఖిత మహెందర్ గౌడ్ ఆధ్వర్యంలో కొబ్బరి కాయలు కొట్టి పూలతో ప్రత్యేక పూజలు చేశారు.

# జర్నలిస్టుల సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత వేతన సమస్యలు గుర్తింపు కార్డుల జారీ వంటి కీలక అంశాలను ఎమ్మెల్సీ ప్రస్తావించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి కలకొండ సంజీవ మాట్లాడుతూ తమ సమస్యలను సభలో ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినందుకు ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపారు. జర్నలిస్టులు సమాజానికి అద్దం పట్టే వర్గం అని వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వం బాధ్యతను పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు ఆరోగ్య భీమా, ఇంటి స్థలాలు వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చేసిన ఈ ప్రయత్నం జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు దోహదపడుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ నాయకులు పి.వెంకటేశ్వర్లు, చిలివేరు సంజీవ, యస్ బాలరాజు, జర్నలిస్టుమిత్రులు పాల్గొన్నారు.

# కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి తొలగించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** బీసీలను అవమానపరిచే విధంగా మాట్లాడిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ప్రభుత్వం మంత్రివర్గం నుంచి తొలగించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలను అడుగడుగునా అవమానిస్తూ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ బీసీల ద్రోహిగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మారారని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా జగ్గారెడ్డి అయితే వంద సీట్లు గెలుస్తామని పార్టీ ఇంకా పుంజుకుంటుందని మాట్లాడడం బీసీలపై ఆయనకు బీసీల పట్ల పచ్చి వ్యతిరేకత ఉన్నట్లు స్పష్టమవుతుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ నియామకం తరువాత తెలగాణాలో బీసీ కులగణన జరగడం, కాంగ్రెస్ పార్టీ పదవులు నియామకాలు 70శాతం బహుజనులకు దక్కాయని, డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో బీసీలకు ప్రాధాన్య కల్పించడం, ఎమ్మెల్సీ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు కేటాయించడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పెద్ద ఎత్తున గెలవడంతో జీర్ణించుకోలేని కోమటిరెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్‌ను తొలగిస్తే రాజ్యంకు అడ్డు ఉండదనే కోమటిరెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేశారని అన్నారు. బంటు వెంకటేశ్వర్లు, దొనేటి శేఖర్, సత్యప్రకాశ్, సురేష్, మురళీకృష్ణ, రవి తేజ, హేమంత్, ఆర్యన్ పాల్గొన్నారు.

# ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



**ప్రజాపక్షం/మోటకొండూరు :** ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్ర మాసంగా భావించే రంజాన్ పండుగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే రంజాన్ కానుకలను తేరియాల గ్రామంలో సర్పంచ్ మంత్రి లతా స్వామి, జిపిఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి ఉమేష్‌ల సమక్షంలో ముస్లిం సోదరులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు సామ భూపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఉపాధ్య క్షుడు తునికి ఉపేందర్, వార్డు మెంబర్లు చామల సక్కుబాయి, బుంగపట్ల శ్రీనివాస్, ఇంద్రాల ప్రహ్లాద, రేగు రజిత శ్రీహరి చిన్నం రాములు తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల సందర్శన తేర్యాలలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను సర్పంచ్ లత స్వామి, జిపిఓ మహేష్, పంచాయతీ కార్యదర్శి ఉమేష్‌లు సందర్శించి గ్యాస్ నిల్వలు సరిగా ఉన్నాయా లేదా అని తెలుసుకున్నారు.

# నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు నానో ఎరువుల వినియోగంపై మండలంలోని ఐలాపురం గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్యం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. నానో యూరియా వాడకం ద్వారా భూసారం మెరుగుపడి పంటలకు పంటలకు అధిక దిగుబడులు లభిస్తాయని, రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని అన్నారు. అదేవిధంగా పంటలకు రోగ నిరోధక శక్తి పెరిగి చీడపీడల ప్రభావం తగ్గే అవకాశం ఉందన్నారు. ఇతర రసాయనాల మందులతో కలిపి నానో యూరియాను స్ప్రే చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్యనాయక్, ఏఈవోలు మాలావత్ రమేష్, షఫి, మాజీ సర్పంఛ్ సైదానాయక్, సంద్రాల వెంకన్న, శ్రీనివాస్, మంగ్తానాయక్, లింగయ్య, శంకర్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.



## గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

**ప్రజాపక్షం/చివ్వెంల :** గ్రామాల సమగ్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని, ప్రతి గ్రామంలో మౌళిక సదుపాయాలు కల్పించడమే మా లక్ష్యమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుంజలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపరిచే దిశగా కృషి కొనసాగుతుందని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నిధులను సమర్థవంతంగా వినియోగించి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులు, ఉపసర్పంచ్ దొనకొండ పావని మహేష్, వార్డు సభ్యులు కొప్పు సైదులు, కొనకంచి మల్లయ్య, బొల్లికొండ దుర్గయ్య, పెదపోలు చందన వీరయ్య గౌడ్, మోలుగూరి శ్రావణి, గ్రామ శాఖ అధ్యక్షుడు దొనకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/మునగాల:** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థినులకు ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ విద్యార్థులకు ముఖ్యంగా రక్త పరీక్షలు నిర్వహించి హెచ్‌బి శాతాన్ని నిర్ధారించడం జరిగిందని, దంత పరీక్షలు, గుండెనొప్పి సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అతి ముఖ్యమైన సిపిఆర్ ఏ విధంగా చేయాలో డెమోనిస్ట్రేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, దంత వైద్యులు డాక్టర్ భార్గవ్, డాక్టర్ సహనాజ్, డాక్టర్ సునీత, వై. సైదులు, ఫార్మసి ఆఫీసర్ కృష్ణవేణి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పండుగ వేల పల్లెల్లో గ్యాస్ కొరత

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** ఊగాది పండుగ పూట పల్లెల్లో గ్యాస్ కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భారత్ గ్యాస్ మోత్కూర్, ఇండియన్ గ్యాస్ తిరుమలగిరి నుండి అడ్డగూడూరు మండలంలోని గ్రామాల్లో సరఫరా కావాల్సిన గ్యాస్ సరఫరా లేక వినియోగదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్యాస్ కోసం మోత్కూర్, తిరుమలగిరి వెల్లి లైల్లో గంటలతరబడి వేచి తెచ్చుకుంటున్నారు. గ్రామాల్లో గ్యాస్ సిలిండర్ సరఫరా లేక వృద్ధులు, వాహనాలు లేనివారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎట్ల గ్యాస్ సరఫరా వారానికి రెండు సార్లు గ్రామాల్లో సరఫరా చేసారో గ్యాస్ ఏజెన్సీ వాళ్ళు అలాగే సరఫరా చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అడ్డగూడూరు మండల కేంద్రంలో గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. గ్యాస్ కష్టాలతో పండుగ పూట పల్లెప్రజలు పస్తులు ఉండే దుస్థితి ఏర్పడింది. ఏగ్రామ ప్రజలు బుక్ చేసుకున్న సిలిండర్ అదే గ్రామంలో ఏజెన్సీలు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏజెన్సీ వాళ్ళు గ్రామాల్లో సరఫరా చేస్తే ఆటో అలవెన్సులు తప్పించుకునేందుకు ఆఫీసు వద్దకే వచ్చిన వారికే సరఫరా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ తీసుకుని పల్లెలకు గ్యాస్ వాహనాలతో యధావిధిగా సరఫరా చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పేదలందరికీ ప్రభుత్వ వైద్యం

**ప్రజాపక్షం/మోతె :** పేదలందరికి ప్రభుత్వం వైద్యం అందించే లక్ష్యంతో ప్రజాపాలన కొనసాగించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ దోసపాటి అనురాధ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిభిరం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. సుమారు 393 మంది లబ్ధిదారులు పాల్గొనగా 32 మందికి రక్త నమూనాలు తీసుకొని టి హబ్‌కు పంపినట్లు డాక్టర్ల బృందం వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, తహాశీల్దార్ యం వెంకన్న, డాక్టర్లు పి రవి కుమార్, కామేశ్వరి, వైష్ణవి, మాతృనాయక్, సమీరా, మనీషా, అచ్చిత, భవాని పాల్గొన్నారు.





## కార్మికుల సేవలు అమూల్యం

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** గ్రామ పరిశుభ్రత కోసం నిత్యం కష్టపడుతున్న గ్రామ కార్మికుల సేవలు అమూల్యమైనవని సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్ అన్నారు. బుధవారం బొమ్మలరామారం గ్రామంలోని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సిబ్బందికి పారిశుద్ధ కార్మికులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి పరిషత్తులు పంచాయతీ సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి కృషిని గుర్తించి సన్మానించడం ప్రతి ఒక్కరి బాధ్యతని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను 61 మంది లబ్ధిదారులకు తహసిల్దార్ పల్నాటి శ్రీనివాస్ రెడ్డి కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ వివాహానికి ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, ఆయా గ్రామాల సర్పంచ్ లు తోటకూరిశంకర్, ఆర్ఐ జబ్బెరుద్దీన్, జిపిఓలు, రాజు, రాధిక, వెంకన్న పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** వేసవికాలం ప్రారంభమై ఎండలు తీవ్రతరం అవుతుండడంతో ప్రజల దాహార్తి తీర్చాలనే సంకల్పంతో మోటకొండూర్ ఎస్ఐ డి.అశోక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పోలీస్ స్టేషన్ ఆవరణంలో చలి వేంద్రం ఎర్పాటు చేయగా మోటకొండూర్ సర్పంచ్ భూమండ్ల జేయమ్మ బుదవారం ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో మోటకొండూర్ ఉపసర్పంచ్ వంగాల నిఖిత, మాటూర్ సర్పంచ్ జన్నే సిద్దులు, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు జూకంటి మదు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంజియు లా కళాశాల ప్రిన్సిపాల్‌గా రవి నియామకం

**ప్రజాపక్షం/నలగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటైన లా కళాశాల ప్రిన్సిపాల్ గా కామర్స్ విభాగ ఆచార్యులు ఆకుల రవిని నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.ఆచార్య ఆకుల రవి విశ్వవిద్యాలయానికి సిఓఈ గా,కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ గా,ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గా,వివిధ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించారు.ఆచార్య ఆకుల రవి నియామకం పట్ల ఉప కులపతి ఆచా ర్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్,అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

## గ్యాస్ కొరతకు నిరసనగా సిపిఐ ధర్నా




**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం గ్యాస్ కొరత, గ్యాస్ ధరల పెరుగుదలకు బిజెపి ప్రభుత్వ విధానాలే కారణం అని చందంపేట మండల సిపిఐ కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గ్యాస్ కొరత, గ్యాస్ ధరల పెరుగుదలకు నిరసనగా ధర్నా నిర్వహించి ఆయన మాట్లాడుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసి గ్యాస్ ధరలను పెంచాలని కేందరలోని బిజెపి ప్రభుత్వం చూస్తుందని, పేద ప్రజలకు ఉచిత గ్యాస్‌లు ఇస్తామని చెప్పి దేశాలు తిరుగుతూ ప్రజల నడ్డిని విరుస్తున్నారని విమర్శించారు. గ్యాస్ ధరలు పెరగడం, ప్రజలకు గ్యాస్ అందుబాటులో లేకపోవడం ప్రధాని మోడీ బాధ్యతరహితమైన విధానాలే కారణం అని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంగలయ్య, కిష్టయ్య, రామస్వామి, శ్రీను, లాలయ్య పాల్గొన్నారు.

## అంబాల గ్రామంలో మద్యపానం నిషేధిస్తూ తీర్మానం



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామంలో సంపూర్ణ మద్యపానాన్ని నిషేదిస్తూ బుధవారం పాలకవర్గం తీర్మానం చేయండి జరిగింది. ఈ తీర్మానాన్ని ఎక్సైజ్ సిఐ, స్థానిక ఎస్ఐ తేజం రెడ్డిలకు అందజేశారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కుల రాణమ్మ మాట్లాడుతూ గ్రామంలో కొందరు వ్యక్తులు అక్రమంగా మధ్యం విక్రయించడం ద్వారా మద్యానికి నిరుపేద కుటుంబాలు, రోజు వారి కూలీలు, యువకులు, విద్యార్థులు బానిసలు కావడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, మద్యానికి బానిసలైన పురుషులు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుత్నారని, భార్యా పిల్లలను వేధించడం జరుగుతున్నందున మహిళా సంఘాల సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణించుకొని గ్రామ పంచాయతీ పాలక వర్గానికి తెలియజేయడంతో మహిళా సంఘాల వినతి మేరకు అంబాల గ్రామ పంచాయతీలో సంపూర్ణ మద్యపాన అమలు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్, పాలకవర్గం సభ్యులు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జక్కుల రాణమ్మ యాదయ్య, ఉప సర్పంచ్ బీసు ప్రశాంత్, వార్డు సభ్యులు మధు, మహేష్, సోమిరెడ్డి, నర్సింహా, యాదయ్య, రేణుక, భాగ్యలక్ష్మి, భాగ్య, వెన్నెల, గ్రామ పెద్దలు శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

## యువతికి పునర్జన్మనిచ్చిన యశోద వైద్య నిపుణులు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పారా క్వాట్ అనే ప్రమాదకరమైన విషపదార్థాన్ని సేవించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న 28 ఏళ్ల యువతిని మలక్‌పేట్ యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య నిపుణులు అత్యాధునిక చికిత్సతో రక్షించినట్లు సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ జి.సుధాకర్, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ గుత్తా శశిధర్ రెడ్డి తెలిపారు.బుధవారం నల్లగొండలోని శాలిని రెసిడెన్సీలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాధితురాలు మొదట స్థానిక ఆసుపత్రిలో గ్యాస్ట్రిక్ లావేజ్, హీమోపర్‌ఫ్యూషన్ చికిత్స పొందిన అనంతరం మెరుగైన వైద్యం కోసం యశోద ఆసుపత్రికి తరలించబడినట్లు చెప్పారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో తీవ్రమైన కిడ్నీ దెబ్బతినడం, ఈరోసివ్ గ్యాస్ట్రిటిస్ గ్రేడ్‌డిఈసోఫగైటిస్ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.యూరిన్ డైథియోనైట్ పరీక్ష ద్వారా పారా క్వాట్ విషపూరితం నిర్ధారణ కావడంతో, వైద్య బృందం పర్యవేక్షణలో రెండు సార్లు హీమోపర్‌ఫ్యూషన్, రెండు సార్లు డయాలసిస్, ఇన్‌ట్రావీనస్ యాంటీబయాటిక్స్,గ్యాస్ట్రోప్రొటెక్టివ్ చికిత్స అందించినట్లు వివరించారు. కిడ్నీ, కాలేయ పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స అందించడంతో రోగి క్రమంగా కోలుకుని స్వయంగా నడిచే స్థితికి చేరుకుందని తెలిపారు.పరిస్థితి మెరుగుపడడంతో అవసరమైన మందులు,ఫాలోఅప్ సూచనలతో ఆమెను డిశ్చార్జ్ చేసినట్లు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో డాక్టర్ డి.ఉగంధర్,డాక్టర్ కిషన్ నున్సవాతా,కే.శ్రీనివాస్ రెడ్డి,శ్రీనివాస్ చిదుర,ఏ.వాసు కిరణ్ రెడ్డి తదితరులున్నారు.

## పేద కుటుంబానికి అండ

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు లకినేనిగూడెం గ్రామానికి చెందిన తీగల పాపయ్య(76) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం కన్నుమూశారు.పేద కుటుంబానికి చెందిన ఆయన మృతి పట్ల స్థానికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.మరణ వార్త తెలుసుకున్న 3వ వార్డు కౌన్సిలర్ సామ సుజాయాదవ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం తక్షణ ఖర్చుల నిమిత్తం మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేసి తన మనసున్నతిని చాటుకున్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కళ్ళెం సురేందర్ రెడ్డి,పాశం నర్సిరెడ్డి,చొప్పరి నరసింహా (ఎల్ఐసి), కారింగు బిక్షం గౌడ్, సైదులు రెడ్డి, పాల్గొన్నారు.



## నూతన వస్త్రాలు బహుకరణ

**ప్రజాపక్షం/కోదాడ:** పండుగకు పేద విద్యార్థులకు ఉపాధ్యాయుడు ఎస్కె ఖాజామియా నూతన వస్త్రాలు బహుకరించడం దాతృత్వ గుణానికి అభినందనలని మండల విద్యాధికారి సలీంషరీఫ్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జమాతే ఇస్లామి హింద్ సంస్థ కోదాడ పట్టణ అధ్యక్షులు, గణితశాస్త్ర ఉపాధ్యాయుడు ఖాజామియా ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా దాదాపు 20 మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు బహుకరించినట్లు తెలిపారు.



## పది పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. ఆయన బుధవారం మోటకొండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో నిర్వహణ ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాం తంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు తదితర అంశాల గురించి అడిగి తెలుసున్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత పోలీస్ బందోబస్తుతో పరీక్ష పేపర్లను జాగ్రత్తగా తీసుకెళ్ళాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## వీర వనిత మల్లు స్వరాజ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** భూస్వామ్య కుటుంబంలో జన్మించినా పీడిత ప్రజల కోసం అలుపెరుగని ఉద్యమాలు చేసిన వీర వనిత మల్లు స్వరాజ్యం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఆమె వర్ధంతి సందర్భంగా పట్టణంలోని కార్యాలయంలో ఆయన ఆమె చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, మానవాళి విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో ఆమె నిజాంకు, రజాకార్లకు వ్యతిరేకంగా తుపాకి చేతపట్టి పోరాటాలు చేసి పేదలకు భూ పంపిణి చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, వెంకటేశ్వర్లు, మంగారెడ్డి, గౌతంరెడ్డి, భావండ్ల పాండు, జగదీశ్చంద్ర పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో బుధవారం గ్రామ పంచాయతీ కార్మికులు బస్టాండ్ రోడ్డు పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ కార్మిక జేఏసి నాయకులు పరుశురాములు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫాంలు, గౌజులు, మాస్కులు, సబ్బులు అందజేయాలని, జిపి కార్మికులకు ఆరు నెలలకు ఒక సారి హెల్త్ చెకప్ చేయించి, హెల్త్ కిట్‌లను అందజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. జిపి కార్మికులపై పని భారాన్ని తగ్గించి పండుగల సమయంలో సెలవులను అమలు చేయాలని తదితర డిమాండ్లను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## సర్వమతాల సారాంశం ఒక్కటే..

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సర్వమతాల సారాంశం ఒక్కటేనని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ స్కూల్ డైరెక్టర్ మహమ్మద్ నూరుద్దిన్ అన్నారు. గురువారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ స్కూల్ లో ఉగాది, రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉగాది పండుగే మన తెలుగువారికి నూతన సంవత్సరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల అఖిల, హేమ, సంధ్య, చంద్రకళ, కీర్తన, ఐశ్వర్య, శిల్ప, షరీఫ్, చంద్రశేఖర్, ఆండాలు, లక్ష్మి, సంధ్య, మంగ, శ్రీను పాల్గొన్నారు.





## రెయిన్‌బోలో ఉగాది సంబరాలు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని రెయిన్‌బో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో గురువారం ఉగాది పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు సాంప్రదాయ దుస్తువులతో పాఠశాలకు వచ్చి నృత్యాలతో, డ్రామాలతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం. ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ ఉగాది అంటే కొత్త ప్రారంభాలకు సంకేతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం. ఆనంద్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఫరిహిన్ సుల్తానా, ఉపాధ్యాయులు బాలయ్య, సుష్మ, శ్రీలత, నాగమణి, డ్యాన్స్ మాస్టర్ చిన్న, డ్రాయింగ్ టీచర్ ఉమా మహేశ్వరి, పిఈటి సంధ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఉద్యోగం కోసం దళారుల మాట నమ్మి మోసపోవద్దని పొనుగోడు ఉప సర్పంచ్ జోగు అరవిందరెడ్డి కోరారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మల్టి పర్పస్ వర్కర్లుగా ఉద్యోగం ఇప్పిస్తామంటూ చెప్పి మాయమాటలు నమ్మి దళారుల చేతిలో మోసపోవద్దని అన్నారు. గ్రామ పంచాయతీ వర్కర్లుగా మల్టిపర్పస్ విధానందో కొందరిని తీసుకుంటామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆదునుగా తీసుకుని కొంతమంది దళారులు అమాయకుల వద్ద ఒక్కొక్కరి నుంచి లక్ష రూపాయలు తీసుకుని ఉద్యోగం ఇప్పిస్తానంటున్నారని అన్నారు. మల్టిపర్పస్ వర్కర్లుగా చేరేవారు దళారుల మాట నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని కోరారు.

## 'వేస్ట్ టు వెల్త్ 'ప్రదర్శనతో విద్యార్థుల్లో సృజనాత్మకతకు ప్రోత్సాహం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆదేశాల మేరకు ఏకో క్లబ్ ఆధ్వర్యంలో "వేస్ట్ టు వెల్త్" ప్రదర్శన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ వ్యర్థాలను సంపదగా మార్చడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల వారి సృజనాత్మకత పెంపొందడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే ఆలోచనలు కలుగుతాయని అన్నారు. కార్యక్రమంలోఏకో క్లబ్ కన్వీనర్ వి.శిరీష,సభ్యులు కె.శివరాణి, డాక్టర్ పి.సిద్ధేశ్ గౌడ్, డాక్టర్ డి. కృష్ణతో పాటు బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూడవ రోజుకు దీక్ష

**ప్రజాపక్షం/రామన్నపేట :** మూడు రోజులుగా రామన్నపేట ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని సిపిఐ(ఎం) పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్ష శిబిరానికి స్థానిక పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం తెలుపుతూ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

## కూరగాయల మార్కెట్టా..? చెత్త డంపింగ్ యార్డా?

### మురికికూపంగా మారిన యాదగిరిగుట్ట 'అంగడి బజార్'



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పట్టణ నడిబొడ్డున ఉన్న అంగడి బజార్ కూరగాయల మార్కెట్ ప్రస్తుతం కూరగాయల విక్రయాలకు కాకుండా, చెత్తాచెదారానికి నిలయంగా మారిందని యాదగిరిగుట్ట పట్టణ బిఆర్ఎస్ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన అంగడి బజార్ ప్రాంతాన్ని సందర్శించి, అక్కడ పేరుకుపోయిన మురికిని, దుర్వాసనను చూసి మున్సిపల్ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడిన 4వ వార్డు అలాగే 11వ వార్డుల మధ్య విస్తరించి ఉన్న అంగడి బజార్ ప్రస్తుతం భారీగా పేరుకుపోయిన చెత్తతో కంపు కొడుతోంది. ఇది మార్కెట్లా కాకుండా చెత్త డంపింగ్ యార్డులా కనిపిస్తోంది.అపరిశుభ్రత వల్ల స్థానిక నివాసితులు ,వ్యాపారులు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. మురికికూపంగా మారుతున్న ఈ ప్రాంతంపై అధికారులు దృష్టి సారించకపోవడం దారుణం.పట్టణం నడిబొడ్డున ఇంత దారుణమైన పరిస్థితి ఉన్నా, మున్సిపల్ చైర్మన్, కమిషనర్లకు ఇది కనబడటం లేదా అని ఆయన ప్రశ్నించారు.అంగడి బజార్లోని మురికిని, చెత్తాచెదారాన్ని తక్షణమే తొలగించాలి. మున్సిపల్ యంత్రాంగం నిద్ర వీడి వెంటనే చర్యలు చేపట్టాలి, లేనిపక్షంలో ప్రజల పక్షాన ఆందోళనలు ఉధృతం చేస్తాం. తక్షణమే మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని మరియు భవిష్యత్తులో చెత్త పేరుకుపోకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పాపట్ల నరహరి మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య, లింగం పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన గ్రామ సర్పంచ్



**ప్రజాపక్షం/రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిధిలోని పల్లివాడ గ్రామంలో బుధవారం 90 రోజుల ప్రణాళికలో భాగంగా స్థానిక పాఠశాలను గ్రామ సర్పంచ్ కంభం పాటి శ్రీనివాసులు సందర్శించారు. మధ్యాహ్న భోజన పరిశీలనలో భాగంగా సర్పంచ్ మరియు గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటేశం, స్కూలు ప్రధానోపాధ్యాయులు సుధారాణి, మధు, ఉపాధ్యాయ బృందం పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఉగాది పండుగను పురస్కరించుకొని విద్యార్థినీ, విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేసి సేవించారు. పాఠశాల ఆవరణంలో పిల్లలు కాళ్లు చేతులు కడుక్కోవడానికి ఉపయోగించే వ్యర్థ నీటితో పాఠశాల ఆవరణంలో బురదగా ఉండడం గమనించి, అక్కడ పిల్లలకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ సోఫిట్స్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోఉపాధి హామీ ఇంజనీరు ప్రవీణ్, టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, కృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చంద్రమౌళి మరణం తీరని లోటు- సాధినేని



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సీనియర్ నాయకులు చెరుపల్లి చంద్రమౌళి మరణం పార్టీకి తీరని లోటని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం నిర్వహించిన చంద్రమౌళి అంతిమయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఇంటి పేరు కాకుండా బీజేపీ చంద్రమౌళిగా ఈ ప్రాంత ప్రజలందరికి సుపరిచితుడన్నారు. కాగా చంద్రమౌళి భౌతిక కాయానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీషనవీన్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తూడిపల్లి రవికుమార్, గోలి మధుసూదన్‌రెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, బంటు సైదులు, వనం మదన్‌మోహన్, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, తల్లం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దేవర్ల ఉత్సవాలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని సింగిరెడ్డిపాలెం గ్రామంలో దేవర్ల ఉత్సవాలను నిర్వహించేందుకు గ్రామం మొత్తం ముస్తాబు అవుతోంది. ఉగాది సందర్భంగా గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామంలోని యాదవుల ఆరాధ్య దైవాలైన ఇంటి దేవరలను యాదవులు భక్తిశ్రద్ధలతో పూజించి ప్రత్యేక కార్యక్రమాలు చేస్తారు. ఈ ఉత్సవాలు గ్రామ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతిబింబంగా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.



## కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/నూతనకల్ :** మండలంలోని యడవల్లి గ్రామ సర్పంచ్ జటంగి సరిత కృష్ణ యాదవ్ గ్రామంలోని పలు అభివృద్ధి పనుల నిమిత్తం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, ప్రాథమికోన్నత పాఠశాలను పిఎం శ్రీ పథకం కింద గుర్తించి నిధులు మంజూరు చేయాలని కోరారు.







## లాభసాటి పశుపోషణపై అవగాహన

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఏటిఎంఏ 2025/26) వారి సౌజన్యంతో బుధవారం మండలంలోని జల్మలకుంట తండలో, గూడెపుతండలలో పాడి రైతులకు లాభసాటి పశుపోషణ, పాడిలో అవలంభించాల్సిన ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్థక సహాయ సంచాలకులు డాక్టర్ బి వెంకన్న మాట్లాడుతూ పాడి పరిశ్రమతో రైతులకు ఎంతో లాభం చేకూరుతుందన్నారు. దీనిలో మెలుకువలు తెలుసుకొని ఆధునిక పద్ధతులు అవలంభించడంతో పాల దిగుబడి ఎక్కువగా వస్తుందని చెప్పారు. గ్రామ సర్పంచ్ జామానాయక్, అనంతారం పశు వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, గడ్డిపల్లి పశు వైద్యశాఖాధికారిని డాక్టర్ జయసుధ, పెన్‌పహాడ్ పసువైద్యాధికారి డాక్టర్ ఏ వెంకన్న పాల్గొన్నారు.

## పాఠశాల వేదిక నిర్మాణ దాతకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మండలంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిబ్లక్ పల్లి, ప్రాథమిక పాఠశాలలో దాస్ సేవ సమితి సహకారంతో రూ.9.5 లక్షలతో పాఠశాల భవనానికి పెయింట్, వేదిక వెడల్పు, మెయిన్ గేటు, ప్రహరీ గోడకు పెయింట్ వంటి అభివృద్ధి పనులు చేసిన దాతకు ఆ గ్రామ సర్పంచి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాతలను కొనియాడుతూ బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ ఆర్ల వెంకటేశం, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, ఉపాధ్యాయులు సత్య శుభాకర్ కలీముద్దీన్, వెంకట్ రెడ్డి, విజయ లక్ష్మి, మేరీ, నర్సిరెడ్డి, మంజుల, శ్రీనివాస్, నర్సింహులు ధన్యవాదాలు తెలిపారు.

## సైనిక్ స్కూల్‌లో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** మండలంలోని పాండు నాయక్ తండ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి ధరావత్ ప్రవీణ్‌కుమార్ సైనిక్ స్కూల్‌లో గిరిజన కోటాలో రాష్ట్రస్థాయిలో ఐదవ ర్యాంక్ పొంది ఆరవ తరగతిలో అడ్మిషన్ సాధించి తన సత్తా చాటాడు. ఇటీవల విడుదలైన నవోదయ ఎంట్రన్స్ పరీక్షలో జనరల్ కోటాలో రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కటకం నరసింహ స్వామి తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి పోటీపరీక్షల కోసం ప్రత్యేకమైన శిక్షనను అందిస్తున్నామని దాని ఫలితంగానే ఈ విజయం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ర్యాంక్ సాధించడంపట్ల విద్యార్థిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

## రంజాన్ తోఫా పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రంజాన్ పండుగ సందర్భంగా బుధవారం తుర్కపల్లి మండలంలోని తీర్మాలపురం గ్రామంలో ముస్లిం కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదేశానుసారం బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో గ్రామ సర్పంచ్ ధోనికెన రేణుక వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వంగ నారాయణ రెడ్డి, నాయకులు వంగ రాజిరెడ్డి, సముద్రాల వెంకటేష్, బోయిని సరిత, పబ్బోజు పాల్గొన్నారు.



## నవోదయకు ఎంపికైన సాత్విక్



**ప్రజాపక్షం/నూతనకల్ :** నవోదయ గురుకుల పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి మండలంలోని అలుగునూరు గ్రామానికి చెందిన గుండగాని సాత్విక్ ఎంపికైనట్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉప్పు నాగయ్య బుధవారం తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాత్విక్ పట్టుదలతో చదివి 89 మార్కులతో 34వ ర్యాంకు సాధించి పాఠశాల ప్రవేశానికి ఎంపికైనట్లు తెలిపారు. సీటు సంపాదించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు నారబోయిన నాగేశ్వరరావు, లింగాల శ్రీనివాస్, రేణుక, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## దాతల సహకారం మరువలేనిది



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతంలో దాతల సహకారం మరువలేనిదని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి నర్సయ్య, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మామిడి వెంకన్న అన్నారు. బుధవారం పాఠశాలలో సిసి కెమెరాల ఏర్పాటుకు పూర్వ విద్యార్థులు రూ.20వేలు నగదుగా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. వారితోపాటు ఆర్‌ఎంపి డాక్టర్ కన్న కవిత జనార్ధన్ అబ్దుల్ కలాం చిత్రపటాన్ని వేయించడానికి ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కళ్యాణి, విజయకుమారి పాల్గొన్నారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ఆటో అందజేత



**ప్రజాపక్షం/మోటకొండూర్:** ఎన్‌ఆర్‌ఎల్‌ఎంఎజివివై పథకంలో భాగంగా మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన సమభావనసంఘం మహిళ నాంపల్లి బార్గవి భర్త నర్సింహులుకు బుధవారం కలెక్టరేట్‌లో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి చేతుల మీదుగా ఆటోను అంద జేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.

## బోరు మోటర్ ఫిటింగ్

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ గ్రామంలోని 14వ వార్డులో నూతన మంచినీటి మోటార్ పంపు పిటింగ్ చేయించి ప్రజలకు నిరంతరం నీటిని అందించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటపాపి రెడ్డి, ఉప సర్పంచ్ మాల్గ మాధవి వెంకటేష్, వార్డ్ నెంబర్ పల్లెర్ల లక్ష్మయ్య కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి ఆపరేషన్‌కు 83 మంది తరలింపు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా ఎంపికైన రోగులను మంగళవారం హైదరాబాద్‌కు తరలించారు.ఇటీవల మునుగోడు క్యాంపు కార్యాలయంలో నాంపల్లి మండల ప్రజల కోసం నిర్వహించిన ఉచిత కంటి పరీక్షలలో మొత్తం 243 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో 83 మందిని ఉచిత కంటి శస్త్రచికిత్స కోసం హైదరాబాద్‌లోని శంకర ఆసుపత్రికి పంపించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య,టౌన్ ఉప సర్పంచ్ పానగంటి నిర్మల వెంకటయ్య,మాల్ మార్కెట్ డైరెక్టర్ పూల యాదగిరి పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల కేంద్రంలోని జడ్పిహై స్కూల్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి వార్షిక పరీక్షలను బుధవారం నాంపల్లి తహసీల్దార్ గూగులోత్ దేవా సింగ్ , మండల విద్యాశాఖాధికారిమల్లికార్జునరావు పరిశీలించారు.హిందీ పరీక్ష జరుగుతున్న విధానాన్ని అధికారులు సమీక్షించి,పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయా అనే విషయాన్ని వారు ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, మోడల్ స్కూల్‌లో 200 మంది,హైస్కూల్‌లో 190 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.మొత్తం 100 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు.పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

## మల్లు స్వరాజ్యం జీవితం ఆదర్శనీయం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య అన్నారు. ఆమె 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో,సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సూర్యాపేట జిల్లాకు చెందిన జుట్టుకొండ వీరయ్యకు ఉచిత మోకాలు మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో సత్యవతి హాస్పిటల్ ఎండి డాక్టర్ రాంమనోహర్,ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి,ఎంజియు అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత,లెక్చరర్ షేక్ సుల్తానా,డాక్టర్ చైతన్య,డాక్టర్ సంపద,సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకగా ఇఫ్తార్ విందు





**ప్రజాపక్షం/రామన్నపేట :** రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక ఎస్సై డి.నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నాగార్జున స్కూల్‌లో కరస్పాండెంట్ డాక్టర్ నకిరేకంటి నాగరాజు, ప్రిన్సిపాల్ రేఖ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఉత్తమ పోలీస్ అవార్డు అందుకున్న కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సురేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏటెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఎండి జమ్మీరుద్దీన్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండల పట్టణ ముస్లిం సోదరులకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక జమా మసీద్ ప్రభుత్వం తరపున బుధవారం ఇఫ్తార్ విందుని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రెడ్డి అంజన్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భారత లవ కుమార్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** డిండి గ్రామంలోని ముస్లీం మైనార్టీలకు రంజాన్ పండుగ పురస్కరించుకొని బుధవారం సాయంత్రం ఉపవాసాల అనంతరం డిండి పట్టణంలోని ముస్లీం మైనార్టీ షాదీ ఖానాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిండి తహశీల్దార్ హనుమంతు శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్ధనల అనంతరం ముస్లీం, మైనార్టీలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నందికొండ:**మున్సిపాలిటీ హిల్ కాలనీలో బుధవారం సాయంత్రం మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందు నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రెస్ శ్రీనివాస్ స్థానిక మసీదులో ముస్లిం సోదరుల కోసం ఈ విందును ఏర్పాటు చేశారు.





## రైతు సంఘం జిల్లా 3వ మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఏప్రిల్ 6,7 తేదీలలో పోచంపల్లిలో నిర్వహిస్తున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా 3వ మహా సభలను రైతులు, ప్రజలు, రైతాంగ అభిమానులు తగిన సహకారం అందించి జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం పోచంపల్లి మండలం కేంద్రంలోని రైతు సంఘం మండల కార్యాలయంలో రైతు సంఘం జిల్లా 3వ మహాసభల జయప్రదం కోసం ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం గూడూరు బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చి మాట్లాడుతూ జిల్లాలో రైతాంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర రైతు సంఘానిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు, పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి, రైతు సంఘం నాయకులు నోముల కృష్ణారెడ్డి, సామ జంగారెడ్డి పాల్గొన్నారు.

## తెలుగు కొత్త సంవత్సర ఉగాది వేడుకలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండలంలోని ముల్కలపల్లి గ్రామ పరిధి విశ్వభారత్ గ్లోబల్ హైస్కూల్‌లో బుధవారం 'ఉగాది' సంబరాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు సంవత్సరాది ఉగాది కొత్త సంవత్సరం సందర్భంగా సాంప్రదాయ దుస్తులు ధరించి, సంప్రదాయ పాటలతో ఆడి, పాడి ఆనందంగా నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, టీచర్లు తెలుగు సంవత్సరాది ఉగాదికి నాంది, ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రకృతి సహజ సిద్ధంగా లభించే మట్టి కుండలో చేసే మామిడి, చింత, వేప, చెరుకు, బెల్లం కలగలిపిన షడుచుల గొప్పదనం, తీపివంటల కమ్మదనం ఉగాది పచ్చడి, ప్రకృతితో మమేకమయ్యేది ఉగాది పండుగ అని అన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ చంద్రారెడ్డి భార్య అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న తోటి రేషన్ డీలర్లు వారి సంఘం తరపున రూ.50,000 ఆర్థిక సాయం డీలర్ చంద్రారెడ్డికి అందజేసి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎలాగాల రాజయ్య, మండలం అధ్యక్షులు చిట్టిమల కుమార్, స్టేట్ జాయింట్ సెక్రటరీ గంగాదేవి మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు సర్ఫి వెంకటేష్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను సన్మానం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** ప్రజా పాలన 99 రోజులు ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం శివారెడ్డి గూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఒక్క మల్లారెడ్డి ఆ గ్రామ పారిశుధ్య కార్మికులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రజాసేవలో విధి నిర్వహణ చేస్తూ గ్రామ పచ్చదనం పరిశుభ్రతలో వారి పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిలుకల సంతోష్ యాదవ్, వార్డ్ సభ్యులు, గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

